కార్వాన్‌లో బీజేపీకి పెరిగిన ఓటుబ్యాంకు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో బీజేపీ ఓటు బ్యాంకును ఘననీయంగా పెంచుకుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి పడిన ఓట్లు గత అసెంబ్లీ ఎన్నికల కంటే బాగా పెరిగాయి. బీజేపీ అభ్యర్థి టి.అమర్‌సింగ్ ప్రణాళిక బద్ధంగా ప్రచారం నిర్వహించారని తెలుస్తుంది. బీజేపీకి ఉన్న సంస్థాగత ఓట్లతో పాటు మోదీ మ్యాజిక్ కూడా బీజేపీ అభ్యర్థికి కలిసొచ్చిందనే చెప్పాలి. ఈసారి బీజేపీ యువకులు, సీనియర్ బీజేపీ నాయకులు, మహిళలకు ప్రత్యేకంగా టీమ్‌లను ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహించింది. 2018 ఎన్నికల్లో బీజేపీకి వచ్చిన ఓట్ల కంటే ఈసారి ఎన్నికల్లో వచ్చిన ఓట్లు బాగా పెరిగాయి. బీజేపీలో అంతర్గత విబేధాలు లేకపోవడం కూడా పార్టీ అభ్యర్థికి కలిసొచ్చిన అంశమనే చెప్పాలి. మజ్లిస్‌కు కార్వాన్‌లో ఇదే చివరి విజయం అని వచ్చే ఎన్నికల్లో మజ్లిస్‌ను మట్టి కరిపిస్తామని బీజేపీ నేతలు చెబుతున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 37 మందిపై కేసు నమోదు

బహదూర్‌పురా : బహదూర్‌పురా ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్‌లో 37 మందిపై కేసులు నమోదు చేసి వాహనదారులను నాంపల్లిలోని 9వ ఎంఎం కోర్టులో హాజరు పర్చగా.. న్యాయమూర్తి 29 మందికి జరిమానాలు విధించారు. 8 మందికి జైలుశిక్షతో పాటు జరిమానాలు విధించారు. ఇందులో ఇద్దరికి ఐదు రోజుల జైలుశిక్ష, జరిమానా, నల్గురికి నాలుగు రోజుల జైలుశిక్ష, జరిమానా, ఇద్దరికి రెండ్రోజుల జైలుశిక్ష, జరిమానాలు విధించినట్లు బహదూర్‌పురా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరుణా కుమార్ తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని,ట్రాఫిక్ నియమనిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న భజరంగ్ సేన నాయకులు

సుల్తాన్‌బజార్: గోషామహాల్ నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ విజయ ఢంకా మోగించడంతో భజరంగ్‌సేనా ఆధ్వర్యంలో బుధవారం గౌలిగూడలోని రామమందిరంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌మందిర్‌లో కృష్ణపక్ష నవమి పూజలు నిర్వహించారు. అనంతరం భజరంగ్‌సేనా రాష్ట్ర అధ్యక్షులు ఎన్ఆర్.లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. గోషామహాల్ నియోజకవర్గంలో రాజాసింగ్ గెలుపు హిందువుల గెలుపు అని అభివర్ణించారు. అధికార పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా హిందూవులు ఏకతాటిపై నిలుచుని రాజాసింగ్‌ను గెలిపించారన్నారు. భజరంగ్‌సేనా నాయకులు సూర్యశుక్లా, మనోజ్, శ్రీనివాసరావు, కరణ్, సునీల్ అగర్వాల్, నందకిశోర్ అగర్వాల్, రాఘవకుమార్, వీరేందర్, అరుణ్‌సింగ్ తదితరులున్నారు.

మహాపడిపూజ బ్రోచర్ ఆవిష్కరణ



ఆవిష్కరించిన భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ప్రతినిధులు

అఫ్జల్‌గంజ్: భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 10న ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 18 పడులతో అయ్యప్ప స్వామి సామూహిక మహాపడిపూజా కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి (బాస్) అధ్యక్షుడు క్యాతం రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి విజయ్‌భాస్కర్, కోశాధికారి మెడిశెట్టి రాకేష్‌లు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఉస్మాన్‌గంజ్‌లోని బాస్ కార్యాలయంలో ప్రతినిధులతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి శబరిమల అయ్యప్పస్వామి దేవాలయం పూర్వమేల్ శాంతి పూజారి బ్రహ్మశ్రీ విష్ణునంబూద్రి హాజరై పూజ విధానాన్ని వివరించారు. బాస్ ప్రతినిధులు విజేందర్‌రెడ్డి, కళ్యాణ్, మధు, అశోక్, నరేష్, హరికృష్ణ, జగదీష్ తదితరులున్నారు.

జియాగూడ: స్వామియే శరణమయ్యప్ప అంటూ అయ్యప్ప భక్తులు శరణుఘోష చేశారు. బుధవారం జియాగూడ సంజయనగర్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో ధర్మశాస్త్ర అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమం ఏర్పాటైంది. రామ్మోహన్ గురుస్వామి ఆధ్వర్యంలో దీపారాధన గణపతి పూజ, అయ్యప్ప అభిషేకం, అలంకరణ, హరిహర పుత్ర భజనమండలి మహేష్ గురుస్వామి ఆధ్వర్యంలో భజన జరిగింది. ఆలయ ప్రతినిధులు సుదర్శన్‌రావు, శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ ముఖేష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



సంధ్య (ఫైల్)

అబిడ్స్ : మంగళ్‌హాట్ పరిధిలోని శివలాల్‌నగర్‌లో నివసించే బాలిక అదృశ్యమైంది. ఇంటి నుంచి బయటకు వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. మంగళ్‌హాట్ శివలాల్‌నగర్‌లో నివసించే కె.సంధ్య (15) వారం రోజుల క్రితం తల్లి సరిత, తండ్రి నరేష్‌లకు ఇప్పుడే వస్తానని ఇంటి నుంచి బయల్దేరింది. తిరిగి రాకపోవడంతో ఆమె తల్లిదండ్రులు తమ ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకి లభించలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఆచూకీ లభిస్తే సంప్రదించాల్సిన నంబరు. 87126 60496.

నాటకరంగాన్ని కాపాడుకోవాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కల్పన కళానికేతన్ సంస్థ 20వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ రాయబార ఘట్టం నాటకాన్ని ప్రదర్శించారు. అనంతరం తెలంగాణ సంగీత నాటక అకాడమీ పూర్వ అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ.. నాటక రంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. రసమయి సంస్థ అధ్యక్షులు ఎంకె.రాము, ఆధ్యాత్మికవేత్త శ్రీధర్, సినీ దర్శకులు రమేష్ కిషన్, సంస్థ సభ్యులు జంగయ్యగౌడ్ తదితరులున్నారు.



కళాకారులను అభినందిస్తున్న ఎంకే.రాము



నివాళులర్పిస్తున్న మెట్రో వాటర్‌బోర్డు ఎస్సీ, ఎస్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ



నేతాజీనగర్‌లో చైర్మన్ గోవర్దన్, బాబురావు తదితరులు



ఎమ్మెల్యే రాజాసింగ్, రవిమాదిగ, శ్రీనివాస్‌మాదిగ తదితరులు

అంబేడ్కర్‌కు నివాళి

అబిడ్స్, మెహిదీపట్నం, చార్మినార్ జోన్ల పరిధిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బుధవారం రాజ్యాంగ నిర్మాత చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన దేశ నిర్మాణానికి చేసిన సేవలను కొనియాడారు. రాజకీయ ప్రముఖులు, ప్రొఫెసర్లు, అసోసియేషన్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వివిధ కులసంఘాల నాయకులు, టీఎన్జీఓస్, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

– చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల బృందం



నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



ఎండోమెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, కృష్ణవేణి, బాబుశంకర్



నివాళులర్పిస్తున్న డీఈఓ రోహిణీ తదితరులు



ప్రొఫెసర్ ఖాసీం తదితరులు



డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని, కేఆర్.రాజ్‌కుమార్



బీఎస్పీ నాయకులు మూల రాంచరణ్‌దాస్



నివాళులర్పిస్తున్న జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

నిరుపేదలకు అండగా ఉండటమే లక్ష్యం



గోల్కొండ: సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. పేదలు, కార్మికులకు అండగా ఉండటమే తమ లక్ష్యమని గోల్కొండ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హమీదుద్దీన్ తహసీన్, ఎం.ఏ.జాకేర్ అన్నారు. బుధవారం గోల్కొండ బంజారా దర్వాజ వద్ద గోల్కొండ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున రిక్షా కార్మికుడు షారుఖ్‌ఖాన్‌కు గూడ్స్ రిక్షా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాలుగా తాము అసోసియేషన్ తరఫున ఎందరో పేదలను ఆదుకున్నామని ముఖ్యంగా లేబర్ అడ్డాల వద్ద వలస కార్మికులకు అండగా ఉంటూ.. వారిని ఎన్నో రకాలుగా ఆదుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వసాయం అందని దివ్యాంగులకు అసోసియేషన్ తరఫున ప్రతి నెల నిత్యావసరాలు అందిస్తూ.. వస్తున్నామన్నారు. కోవిడ్ మహమ్మారి కాలంలో ఉపాధి కోల్పోయిన కార్మికులకు రోజూ రెండు పూటల భోజనం అందించడం జరిగిందన్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు వారికి ఇంటర్, డిగ్రీ కళాశాలలో చేర్పించి వారికి ఉపకరా వేతనాలు అందించామన్నారు. తమ అసోసియేషన్ తరఫున సేవా కార్యక్రమాలు మున్ముందు కూడా కొనసాగిస్తామన్నారు. అసోసియేషన్ సభ్యులు మన్సూర్‌ఖాన్, జావేద్ అలీ తదితరులున్నారు.

గోరక్ష చట్టాలను అమలు చేయాలని వినతి



ఎమ్మెల్యే వివేక్‌ను మెమోంటోతో సత్కరిస్తున్న 'లవ్ ఫర్ కౌ' ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: కాంగ్రెస్ ప్రభుత్వం గో సంరక్షణ కోసం పాటుపడాలని 'లవ్ ఫర్ కౌ ఫౌండేషన్' చైర్మన్ జస్మత్‌పటేల్, ప్రాణిమిత్ర రమేష్ జాగిర్దార్, ఫౌండేషన్ కార్యదర్శి రిదేష్ జాగిర్దార్‌లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్‌పై విజయం సాధించిన గడ్డం వివేక్‌ను 'లవ్ ఫర్ కౌ' ఫౌండేషన్ ప్రతినిధులు మెమోంటోను ఇచ్చి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో గోరక్షణ చట్టాలను కాంగ్రెస్ ప్రభుత్వమైనా సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గెలుపొందడాన్ని తమ ఫౌండేషన్ స్వాగతిస్తుందన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పటిష్టంగా అమలు చేసి గోవులను హింసిస్తున్న వారిపై చర్యలు తీసుకునేలా ప్రణాళికాబద్ధంగా సాగాలని కోరారు. ఆర్‌కే.జైన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌తో ట్రాఫిక్‌కు అంతరాయం



గోల్కొండ మోతిదర్వాజ, మోతి మహల్ రోడ్డుపై ఇలా..

గోల్కొండ: గోల్కొండ మోతీదర్వాజ వద్ద నిత్యం ట్రాఫిక్ చిక్కులు ఏర్పడుతున్నాయి. మోతీ దర్వాజ చౌరస్తా నుంచి మోతీ మహల్‌కు వెళ్లే రోడ్డుపై అక్రమ పార్కింగ్‌లు కొనసాగుతుండటంతో రోజూ ట్రాఫిక్‌జామ్ అవుతుంది. అసలే రోడ్డు ఇరుకుగా ఉండటం దీనికి తోడు షాపుల ముందు ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిలపడి ఉండటంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మోతీ దర్వాజా నుంచి బూరుది మజీద్ వెళ్లే రోడ్డుపై ఉన్న హార్డ్‌వేర్ షాపు ముందు గూడ్స్ ఆటోలు, ట్రాలీలతో పాటు ఇటుక, ఇసుక లారీలు నిలబడి ఉంటున్నాయి. దీంతో పాదాచారులు ఈ రోడ్డును దాటడం అతి కష్టంగా మారింది. ఓ సిమెంట్‌షాపు ఎదుట ఓ కిరాణా షాపు యజమాని కూడా రోడ్డుపైనే తన షాపు సామగ్రి పెట్టడంతో రోడ్డు కాస్తా ఇరుకుగా మారి వాహన రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ గోల్కొండలోనే ఉన్నా కూడా గోల్కొండలో ట్రాఫిక్ నియంత్రణ, అక్రమ పార్కింగ్‌ల నిరోధానికి ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఉస్మానియాలో రోగులకు మెరుగైన వైద్య సేవలు



ఓపీ ప్రధాన ద్వారాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ నాగేందర్

అఫ్జల్‌గంజ్ : పేద రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఉస్మానియా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఉస్మానియాలోని ఓపీ బ్లాక్‌లో ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ నాగప్రసాద్, ఆర్ఎంఓలు డాక్టర్ ఎండీ రఫీ, డాక్టర్ సిద్దీఖీలతో కలిసి పర్యవేక్షించారు. ఓపీ బ్లాకులోని ఓటీ-6, మైనర్ ఓటీలతో పాటు ఆసుపత్రిలోని పలు ప్రాంతాల్లో రోగులు, రోగి సహాయకులు వసతులపై పర్యవేక్షించారు. ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో రోగుల సహాయకుల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఓపీ ప్రధాన ద్వారానికి జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు.

ఫలించిన ప్రార్థనలు



బ్రోచర్‌తో రఫిక్‌బేగ్

చాంద్రాయణగుట్ట: చంద్రాయణగుట్ట ఫూల్‌బాగ్‌కు చెందిన సంఘ సేవకుడు రఫిక్ బేగ్ ప్రార్థనలు మరోసారి ఫలించాయి. ఎన్నికలకు రెండ్రోజుల ముందు తనకు నచ్చిన నాయకుడు ఎన్నికల్లో గెలుస్తాడంటూ.. నిత్యం తెల్లవారుజామున ఆయన ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, రేవంత్‌రెడ్డి సీఎం కావాలని ఆయన ప్రార్థనలు కొనసాగించారు. గతంలో కూడా ఈయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి, పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ కూడా విజయం సాధించాలని ప్రార్థనలు చేసి సక్సెస్ అయ్యారని సమాచారం.

నేటి ప్రమాణ స్వీకారానికి హాజరై ఆశీర్వదించండి !



అలీ మస్కతి

చార్మినార్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం రాష్ట్రానికి మూడో ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం నగరంలోని ఎల్బీస్టేడియంలో ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా అన్ని వర్గాల ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరై ఆయనను ఆశీర్వదించాలని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రచార, ప్రణాళిక కమిటీ కన్వీనర్ అలీ మస్కతి కోరారు. బుధవారం సాయంత్రం ఆయన కోట్ల అలీజాలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తారన్నారు.

హరికథ మహోత్సవాలు ప్రారంభం



హరికథగానం చేస్తున్న పద్మాలయ ఆచార్య

సుల్తాన్‌బజార్: శ్రీ పూర్ణ యజ్ఞ కళాపీఠం, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ నేతృత్వంలో ముట్నూరి యజ్ఞనారాయణశర్మ భాగవతార్ 114వ జయంతి సందర్భంగా హరికథ మహోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మాలయ ఆచార్యచే 'శ్రీ వేంకటేశ్వర ఆవిర్భావం' అనే అంశంపై హరికథాగానం ప్రేక్షకులను అలరించింది. కిన్నెర అధ్యక్షులు ఆర్.ప్రభాకర్‌రావు, కార్యదర్శి కామేశ్వరరావు, మద్దాళి రఘురామ్ తదితరులున్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం



గోల్కొండలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: వికలాంగుల సంక్షేమ పథకాలు, వాటి అమలుపై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయనను గోల్కొండలో పలువురు మజ్లిస్ నాయకులు సన్మానించారు. హైదరాబాద్ వికలాంగుల సంక్షేమ సంఘం గ్రేటర్ అధ్యక్షులు మహ్మద్ జాహెద్ ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ ప్రజల పక్షపాతి అని, సంక్షేమంపై ప్రతినిత్యం తాము పాటుపడుతున్నామన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో దారిద్రరేఖకు దిగువన ఉన్న వారందరికి అండగా ఉండి వారికి వివిధ రకాల సంక్షేమ పథకాలు అందేలా చూస్తానన్నారు. కార్వాన్‌లో ఎక్కువ మంది నిరుపేదలే అని అందువల్లే అటువంటి వారు నివసించే బస్తీలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ.. అభివృద్ధి చేశామన్నారు. మరోవైపు దివ్యాంగులకు మజ్లిస్ పార్టీతో పాటు వ్యక్తిగతంగా తాను కూడా అండగా ఉంటూ వస్తున్నానన్నారు. దివ్యాంగుల పట్ల సానుభూతి కనబరచడం కంటే వారికి అవసరమైన స్వయం ఉపాధికి సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉందన్నారు. కార్వాన్ ప్రజల సేవకుడిగానే తాను ఉంటానని ఇతర విషయాలను పట్టించుకోనన్నారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, వజీఉజ్‌జమా, అబీబ్ చావూస్, అసద్, యామిన్‌ఖాన్, రాహూఫ్, మహ్మద్ తాహేర్ తదితరులున్నారు.

గాంధీభవన్ వద్ద కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న విద్యార్థి సంఘ నాయకులు

నాంపల్లి: సీఎంగా రేవంత్‌రెడ్డి ఎల్బీస్టేడియంలో గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా నాంపల్లిలోని గాంధీభవన్‌లో సందడి వాతావరణం నెలకొంది. విద్యుత్ దీపాలతో కాంతులీనుతోంది. బహిరంగ సభకు హాజరుకానున్న ముఖ్యనేతలు, కార్యకర్తలకు గాంధీభవన్ వర్గాలు పాసులను జారీ చేశాయి. సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమైంది. ఇప్పటికే జిల్లాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు నగరానికి చేరుకున్నాయి. నాంపల్లిలోని హోటల్స్, లాడ్జీలన్నీ నిండుకున్నాయి.

పెద్దఎత్తున ర్యాలీ...

బహదూర్‌పురా: తెలంగాణ సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి పాతబస్తీ నుంచి పెద్ద ఎత్తున ర్యాలీగా తరలివెళ్లనున్నామని బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహ్మద్ అహ్మద్ షరీఫ్ అన్నారు.

జేఎన్టీయూలో సంబరాలు..

నాంపల్లి: సీఎంగా ఎనుముల రేవంత్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా మాసబ్‌ట్యాంక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ ఫైన్ అండ్ ఆర్ట్స్ యూనివర్సిటీలో విద్యార్థులు బుధవారం మధ్యాహ్నం సంబరాలు నిర్వహించుకున్నారు. టపాకాయలు పేల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. విద్యార్థి నేత భరత్‌కుమార్ మాట్లాడుతూ.. గడీల పాలన పోయి ప్రజాపాలన వచ్చిందన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్‌యూఐ నాయకులు హరీష్‌గౌడ్, శ్రీమంత్, శ్యామ్, సిద్ధిఖ్, అక్షయ్ పాల్గొన్నారు.